

వైభవంగా బ్రహ్మోత్సవాలు

భట్టిప్రోలు : పెదపులివర్రులోని శ్రీ భూనీళా సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం నిర్వహించారు.




ముగిసిన బ్రహ్మోత్సవాలు

తెనాలి: బాలాజీరావుపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సాయంత్రం పెద్ద రథం ఊరేగింపు జరిగింది.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



దాచేపల్లి : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ మాశెట్టి బుజ్జి, సభ్యులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

రెంటచింతల గరిష్ట ఉష్ణోగ్రత 42.5 డిగ్రీలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రత 42.5 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27.2 డిగ్రీలుగా నమోదైంది. సుర్రుమంటున్న ఎండలకు గ్రామస్తులు హడలిపోతున్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 వరకు కూడా ఎండ తీవ్రత తగ్గకపోవడంతో గ్రామంలోని ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రానున్న ఏప్రిల్, మే నెలలో ఎండల తీవ్రత ఇంకెంత పెరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ

నరసరావుపేట రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని కోటప్పకొండ గిరి ప్రదక్షిణను భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. తొలుత గణపతికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. శివ నామ స్మరణ చేస్తూ భక్తులు నడక సాగించారు. చిలకలూరిపేట మేజర్ వద్ద నూతనంగా నిర్మించిన శివ కుటుంబం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. ఘాట్‌రోడ్డు దగ్గరున్న విజయ గణపతి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, తాగునీరు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు అనుమోలు వెంకయ్యచౌదరి, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

డీఈఓ సీవీ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు శనివారం నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు విద్యార్థులకు ఒక్కపూట తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. టెన్త్ పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా, గ్రామ పంచాయతీ, వైద్యారోగ్య శాఖ సహకారంతో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పాఠశాలల్లో అందుబాటు ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాలు, చెట్ల కింద తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనంలో సేవా సంస్థలు, స్థానికుల సహకారంతో మజ్జిగ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

16 నెలల్లో నిడమర్రు రైల్వే గేటుపై వంతెన నిర్మాణం పూర్తి

రాష్ట్ర మంత్రి నారా లోకేష్



మంగళగిరి: మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శుక్రవారం యర్రబాలెంలో ఆధునికీకరించిన శ్రీ భగవాన్ మహవీర్ గోశాలను, కొత్త భవన సముదాయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ నిడమర్రు రైల్వే గేటు వంతెన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి 16 నెలల్లోపు పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజీ అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు మరో రెండు వారాలలో పరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ ఆకుల జయసత్య, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, ఆకుల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అంతా మోసం గురూ..!

తూకాల

తక్కెడ వ్యాపారుల చేతుల్లో తకధిమి అంటూ ఊగిసలాడుతోంది. పీజీలు చదివినోళ్లను సైతం బోల్తా కొట్టిస్తోంది. వంటింటి బడ్జెట్‌ను పైసల సహా లెక్కగట్టే మహిళలను ఏమార్చి ముంచేస్తోంది. కేజీ రాయి అరిగిపోయి వినియోగదారుల జేబులు కరిగిస్తోంది. కూరగాయల నుంచి సరుకుల వరకు ప్రతి వస్తువులోనూ మోసమే ఎదురవుతోంది. ప్రజల్లో ప్రశ్నించే తత్వం కరువైంది. నిలదీసే అవగాహన లేక, వినియోగదారుల హక్కుల గురించి చెప్పే వారు కానరాక తూకాల తక్కెడలో ప్రజల సొమ్ము ఆవిరవుతోంది. ఇలా నిత్యం తూకాల్లో వినియోగదారులకు ఎదురయ్యే మోసాలపై సాక్షి ప్రత్యేక కథనం.

తూకంలో చేతివాటం

- దొంగ కాటాలతో ప్రజలను ఏమార్చి మోసం
- అరిగిపోయిన కేజీ రాళ్లతో వినియోగదారుల జేబులకు చిల్లు
- హక్కులు తెలుసుకోవాలంటున్న నిపుణులు
- నేడు వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

సాక్షి గ్రాండ్ రిపోర్ట్



నరసరావుపేట పట్టణానికి చెందిన మీనాక్షి కూరగాయల మార్కెట్‌కు వెళ్లింది. అక్కడ పలు రకాలు కొనుగోలు చేసి ఇంటికి వచ్చింది. అనంతరం వాటిని పరిశీలిస్తే తూకం సక్రమంగా లేనట్లు గుర్తించింది. దీంతో భర్తతో కలిసి మళ్లీ మార్కెట్‌కు వెళితే.. అక్కడ వ్యాపారులంతా కలిసి ఆమెనే ఎదురు ప్రశ్నించారు. ఇది ఒక్క మీనాక్షి సమస్యే కాదు.. ప్రతి వస్తువూ కొనుగోలు చేసే వినియోగదారుడిది! కేజీ సరుకు కొనుగోలు చేస్తే అందులో 50 గ్రాములు తగ్గినంత మాత్రాన ఏమి అడుగుతాములే ! అనే ధోరణిలో ఉన్నారు. కానీ ఇలాంటి వారందరి చేతిలో బ్రహ్మాస్త్రంగా వినియోగదారుల ఫోరం పని చేస్తోంది. ఇది కొనుగోలుదారుల గొంతుకై వ్యాపారుల మోసాలను నిలదీస్తుంది. వినియోగదారులకు అండగా ఉంటుంది. శుక్రవారం చేపల మార్కెట్, కొన్ని దుకాణాల వద్దకు సాక్షి పరిశీలనకు వెళ్లగా.. అక్కడ తూకాల్లో జరుగుతున్న మోసాలు వెలుగు చూశాయి. అరిగిపోయిన రాళ్ల వినియోగం, ఎలక్ట్రానిక్ కాటాలో అక్రమాలకు పాల్పడుతూ వినియోగదారులను దోచుకుంటున్నారు.

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలోని వ్యాపార సంస్థల్లో అధిక భాగం ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తక్కెడలు కూడా ఉన్నాయి. ఎలక్ట్రానిక్ కాటాల వినియోగంలో వ్యాపారులు ప్రజలను బోల్తా కొట్టిస్తున్నారు. జీరో చూసుకోండని చెబుతూనే లెక్కల్లో గిమ్మిక్కులు చేస్తున్నారు. దీన్ని గుర్తించడంలో వినియోగదారులు విఫలమై మోసపోతున్నారు. తక్కెడల విషయంలో అరిగిపోయిన కేజీ రాళ్లనే వినియోగిస్తున్నారు. దీంతో వినియోగదారుల జేబులు గుల్లవుతున్నాయి. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 1,106 మందిపై కేసులు నమోదయ్యాయి. సుమారు రూ. 57.80 లక్షలు జరిమానాలు విధించారు. స్టాంపింగ్ రూపంలో రూ.68 లక్షల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. ప్రజలకు సరుకు కొనుగోలులో ఎలాంటి మోసం ఎదురైనా వెంటనే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాలి.



పట్టణంలోని మిల్లుల్లో నూనెను పరీక్షకు సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఫైల్)

కొత్త చట్టంతో పదును

భారతదేశంలో వినియోగదారుల హక్కులను రక్షించేందుకు 1986లో చట్టం తీసుకువచ్చారు. కాలక్రమేణా వాణిజ్య విధానాలు, వ్యాపార పద్ధతుల్లో మార్పులు చాలా మార్పులొచ్చాయి. ముఖ్యంగా ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరిగాయి. మోసగాళ్లు మరింతగా పెరిగిపోయారు. ఈ క్రమంలో వినియోగదారుల హక్కులను మరింత కాపాడేందుకు పాత చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని 2019లో తీసుకువచ్చారు. జులై 20, 2020లో కొత్త చట్టం దేశమంతటా అమలులోకి వచ్చింది. పాత దానితో పోలిస్తే కొత్త చట్టంలో వినియోగదారుల రక్షణ మండలి ఏర్పాటు, మధ్యవర్తిత్వ ప్యానెళ్లు, అన్యాయమైన వాణిజ్య పద్ధతులపై కఠిన చర్యలు పొందుపరిచారు. వినియోగదారులు సమస్యలను 1915, 1800114000 అనే టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.



అరిగిపోయిన కాటా రాళ్ల వినియోగం



అరిగిపోయిన రాళ్లతో చేపల తూకం

పోరాడే ఓపిక ఉండట్లేదు



జిల్లాలో ఆహార కల్తీలు, తూకాల మోసాలు జరగడానికి వినియోగదారుల్లో అవగాహన, సరైన అధికారులు, సిబ్బందిలేకపోవటమే కారణం. మోసపోయిన వినియోగదారుడు ఫిర్యాదుచేసి కోర్టుకు వెళ్లి తీర్పు వచ్చేంతవరకు ఉండే ఓపిక ఉండట్లేదు. దీని కోసం మా వంతు అవగాహన కల్పిస్తున్నా వారిలో మార్పు రావట్లేదు. లీగల్ మెట్రాలజీలో జిల్లాకు అసిస్టెంట్ కంట్రోలర్, ఇద్దరు ఇనస్పెక్టర్లు మాత్రమే ఉన్నారు. కల్తీలు పట్టుకొని నిర్ధారించేందుకు ప్రయోగశాల ల్యాబ్ రాష్ట్రంలో లేకపోవటం దురదృష్టకరం. ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ విభాగ అధికారులు కలిసి కల్తీలను పరిశీలిస్తే బాగుంటుంది.

–పిల్లి యజ్ఞనారాయణ, పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, నరసరావుపేట

చట్టాలు కాగితాలకే పరిమితం



నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువులు కల్తీకి గురవుతున్నాయి. వాటిని అరికట్టి వినియోగదారుల సంక్షేమానికి ప్రభుత్వం అమల్లో ఉంచిన చట్టాలు కేవలం కాగితాలకే పరిమితమౌతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా వ్యాపారులు, మామూళ్ల మత్తులో అధికారులు ఉండటంతో కల్తీ వస్తువులను కొనుగోలుచేసే వినియోగదారుడు నష్టపోవటమే గాకుండా అనారోగ్యానికి గురవుతున్నాడు. అధికారుల నిఘా, తనిఖీలు నామమాత్రంగానే జరుగుతుండటంతో నాసిరకం వ్యాపారం దర్జాగా జరుగుతోంది. కల్తీలు జరుగుతున్నట్లు వినియోగ సంఘాల దృష్టికి వస్తున్నా ఏమి చేయలేని పరిస్థితులో ఉంటున్నాం.

–కుంచాల స్వామి, పట్టణ వినియోగదారుల సంఘ ఉపాధ్యక్షులు

ప్రశ్నించటంతోనే మార్పు



వినియోగదారులు తూకాల్లో మోసాలపై ప్రశ్నించటంతోనే మార్పు మొదలవుతుంది. అధికారులు తనిఖీల సమయంలో మోసాలు గుర్తించి కేసులు, జరిమానాలు విధిస్తున్నారే తప్పా వినియోగదారుల నుంచి ఎక్కువ ఫిర్యాదులు రావటం లేదు. అధిక శాతం పెట్రోల్ బంక్‌లో అక్రమాలు, కూల్‌డ్రింక్ అధిక ధరలు, తూకాల్లో వ్యత్యాసం వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయి. వెంటనే దాడులు నిర్వహించి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది కంటే ఈ ఏడాది కేసులు అధికంగా నమోదు అయ్యాయి.

– నల్లబోతుల అల్లూరయ్య, అసిస్టెంట్ కంట్రోలర్, పల్నాడు జిల్లా

చెదిరిన రంగుల స్వప్నం



కాపాడేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్న వైద్య సిబ్బంది



కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

హోలీలో విషాదం

- 12 సంవత్సరాలు చిన్నారి మృతి
- రంగులు కడుకునేందుకు వాగులో దిగిన నలుగురు
- ముగ్గురును కాపాడిన రైతులు
- బుస్సాపురంలో విషాదం
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

పెదకూరపాడు: హోలీ పర్వదినం ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. స్నేహితులతో హోలీ జరుపుకుని రంగులను కడుకునేందుకు వాగులోకి దిగిన 12 సంవత్సరాల బాలుడు మృత్యు ఒడిలోకి చేరాడు. మిగిలిన ముగ్గురు స్నేహితులను రైతులు కాపాడంతో ప్రాణాపాయం తప్పింది.కుటుంబ సభ్యులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం బుస్సాపురం గ్రామానికి చెందిన పాటిబండ్ల మహేందర్ అలియాస్ చిన్నా(12) పాటిబండ్లలోని ఓ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. హోలీ పండుగ కావడంతో పాఠశాలకు సెలవు ఇచ్చారు. ముగ్గురు స్నేహితులు పాటిబండ్ల అభినయ్, కూచిపూడి రాహోల్ విక్రమ్, అంకాల సాద్విక్‌తో కలిసి మధ్యాహ్నం వరకు మహేందర్ రంగులు పూసుకుని సరదాగా గడిపాడు. తర్వాత రంగులు కడుక్కునేందుకు కొండ కింద ఉన్న చిన్న వాగులోకి దిగారు. నలుగురు సరదాగా ఈత కొట్టారు. ప్రమాదవశాత్తు పాటిబండ్ల మహేందర్ వాగులోకి పూడికతో కూరుకుపోయాడు. మిగిలిన ముగ్గురు స్నేహితులు వాగు పక్కన ఉన్న చెట్టు కొమ్మను పట్టుకుని ఉండిపోయారు. మహేందర్ కూరుకుపోవడంతో మిగిలిన వారు బిగ్గరగా కేకలు వేశారు. అక్కడే వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు వచ్చి ముగ్గురుని కాపాడారు.



మహేందర్ మృతదేహం

వాగు అడుగు భాగంలో కూరుకుపోయిన మహేందర్‌ను బయటకు తీసి పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

తీవ్ర ప్రయత్నం చేసిన వైద్యులు

మహేందర్‌ను కాపాడేందుకు పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ భరత్ సిబ్బందితో కలిసి తీవ్ర ప్రయత్నాలు చేశారు. గంట పాటు సీపీఆర్‌ను చేసి కాపాడేందుకు కృషి చేశారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

నా చిన్నాను కాపాడండి

మహేందర్ వాగులో పడిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు శ్రీనివాసరావు, నిర్మలలు హడావుడిగా వ్యవసాయ పనులు మానుకుని వచ్చారు. తల్లి నిర్మల "నా చిన్నాను కాపాడండి" అంటూ వైద్యులను వేడుకున్న తీరు కన్నీరు తెప్పించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు విగతజీవిగా ఉండటం చూసి గుండెలవిసేలా తల్లిదండ్రులు విలపించారు. వారికి మహేందర్‌తో పాటు కూతురు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ వైద్యశాలకు తలించినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

ఉత్తీర్ణతా ప్రాప్తిరస్తు !

చదువులమ్మ చెట్టు నీడలో హాయిగా గడిపే విద్యార్థి జీవితంలో పదో తరగతి మొదటి మెట్టు.. భవిష్యత్‌కు ఆలంబన.. జీవన పరమపద సోపాన పటంలో తొలి అడుగు. పదిలో వచ్చిన మార్కులే భవితవ్యానికి గీటురాయి. గుడ్డిగా పరీక్షలు రాయకుండా కొన్ని టిప్స్ పాటించడం టాప్ మార్కులు సాధించవచ్చు. ధైర్యం, ఆత్మవిశ్వాసంతో పరీక్షల హర్డిల్‌ను అధిగమిస్తే చక్కని జీవితానికి మార్గం సుగమం అవుతుంది.

- విద్యార్థులూ.. గెట్ రెడీ !
- ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- పరీక్ష కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వ మార్గదర్శకాలు
- ముందుగానే సందర్శించడం మేలు
- ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లో ఏ ఒక్క పేజీని చించినా మాల్ ప్రాక్టీసుగా పరిగణింపు

సత్తెనపల్లి : జిల్లావ్యాప్తంగా ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు విద్యాశాఖాధికారులు సమాయత్తమయ్యారు. విద్యార్థులంతా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హాల్ టిక్కెట్లు పొందిన విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలను తల్లిదండ్రులతోపాటు ముందుగానే సందర్శించడం మేలు.

విద్యార్థులూ... వీటిని పాటించండి

- ఉదయం 8.30 గంటల కల్లా కచ్చితంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.
- ఉదయం 8.45 నుంచి 9.30 వరకు మాత్రమే అనుమతిస్తారు. ఆ తర్వాత గేట్లు మూసి వేస్తారు.
- విద్యార్థులంతా హాల్ టికెట్‌పై ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి.
- తప్పులుంటే ముందుగానే ప్రధానోపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం దృష్టికి తీసుకెళ్లి సరి చేయించుకోవాలి.
- పరీక్ష కేంద్రంలో ఇచ్చే క్వశ్చన్ పేపర్‌పై ఏడు అంకెలతో ప్రత్యేక కోడ్ ఉంటుంది. హాల్ టికెట్‌పై ఉన్న ఎన్‌రోల్‌మెంట్ నంబరు ఆధారంగా కేటాయించిన రూముల వారీగా విద్యార్థులను కూర్చోపెడతారు. బార్ కోడింగ్ విధానంలో రూపొందించిన ఓఎంఆర్ షీట్లను విద్యార్థులకు రోల్ నంబరు ఆధారంగా పంపిణీ చేస్తారు.
- రోల్ నంబరు ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తరువాత ఇన్విజిలేటర్ వచ్చి బార్ కోడింగ్‌తో కూడిన ఓఎంఆర్ షీట్, ప్రశ్నపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ అందజేస్తారు. తర్వాత ఓఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా పాటించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయరాదు.
- ఇన్విజిలేటర్ ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌పై విద్యార్థి పేరు, పరీక్షకు సంబంధించిన వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివీ నిర్ధారించుకోవాలి.
- గైర్హాజరైన విద్యార్థుల ఓఎంఆర్ షీట్లను అక్కడే ఉంచి, పరీక్ష ప్రారంభమైన తరువాత ఇన్విజిలేటర్లు వాటిని స్వాధీనం చేసుకుంటారు. ఉదయం 9.00 గంటలకు ఇన్విజిలేటర్ వచ్చి ఓఎంఆర్ షీట్ ఇచ్చిన తరువాత, దానిని పూరించేందుకు అవసరమైన సూచనలు చేస్తారు.
- 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైన తరువాత, మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసే వరకు విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు.
- గుర్తింపు కార్డు కలిగి, పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, స్క్వాడ్ బృందాలనే పరీక్ష కేంద్రాల్లోకి తనిఖీలకు అనుమతిస్తారు. కేంద్రాల వద్ద పోలీసు శాఖ 144 సెక్షన్ అమలు పర్చడంతో పాటు విస్తృత రీతిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది.



సత్తెనపల్లిలోని సుగాలి కాలనీ జెడ్పీ హెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

- ప్రశ్న పత్రం లీకేజీ అయ్యిందని, బయటకు వచ్చిందని కొందరు పనిగట్టుకుని చేసే ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకుండా, విద్యార్థులు పరీక్షలకు ప్రశాంతంగా హాజరు కావాలి. ఒక వేళ ఏదైనా సెంటర్ నుంచి ప్రశ్నపత్రం లీకేజీకి గురైతే, అది ఎక్కడ జరిగిందో గుర్తించే విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయాలనే ఆలోచన వీడాలి.
- కాపీయింగ్‌కు పాల్పడినా, జేబులో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా, పరీక్ష కేంద్రంలో క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. పరీక్ష రాసే సమయంలో స్లిప్పులు కనిపిస్తే పరీక్షల నుంచి డీబార్ చేస్తారు.
- ప్రతి విద్యార్థికీ 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్‌ను ఇచ్చి, అదనంగా పేపర్లు అవసరమైతే మరొక 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు. సైన్స్ పరీక్షకు 12 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లలో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీసుగా పరిగణించే విధంగా కఠినమైన నిబంధనలు అమలు పరుస్తోంది.

నృసింహానికి బ్రహ్మారథం



విద్యుత్ దీపాలతో మెరిసిపోతున్న గాలి గోపురం

- నమో నారసింహా
- మంగళాద్రి.. 'జన'దాద్రి
- అంగరంగ వైభవంగా నృసింహుని దివ్య రథోత్సవం

మంగళగిరి/మంగళగిరి టౌన్: జై నారసింహా.. జైజై నారసింహా నినాదాలతో మంగళగిరి శుక్రవారం మార్మోగింది. శ్రీ లక్ష్మీనరసింహుని దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులతో పురవీధులు కిటకిటలాడాయి. స్వామి బ్రహ్మోత్సవాలు 11 రోజులుగా అత్యంత వైభవంగా సాగుతున్నాయి. గురువారం రాత్రి స్వామి కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలలకు ఉభయదేవేరులతో స్వామి దివ్యరథాన్ని అధిరోహించారు. మూడు గంటల పాటు రథోత్సవం సాగింది. గాలి గోపురం నుంచి దక్షిణాభిముఖంగా ప్రారంభమైన రథం మెయిన్ బజార్ మిద్దె సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వరకు కదలింది. అక్కడ ఆంజనేయస్వామి, వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం తిరిగి గాలిగోపురం వద్దకు చేరుకుంది. స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు తిలకించి ముగ్ధులయ్యారు. ఉత్సవ కైంకర్యపరులుగా మాడభూషి వేదాంతచార్యులు వ్యవహరించారు. పద్మశాలీయ శ్రీ లక్ష్మీనృసింహస్వామి రథ చప్పాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులను రథోత్సవానికి తీసుకు వస్తున్న అర్చకులు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభాగంలో జిల్లాకు చోటు

డాక్టర్స్ వింగ్ అఫీషియల్ స్పోక్ పర్సన్‌గా చింతలపూడి అశోక్‌కుమార్



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన పలువురు పార్టీ నాయకులకు రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలలో స్థానం కల్పిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వెన్నా రాజశేఖర రెడ్డిని రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ సంయుక్త కార్యదర్శిగా, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌ను రాష్ట్ర డాక్టర్ల వింగ్ అఫీషియల్ స్పోక్ పర్సన్‌గా నియమించారు.

గొలుసు లాక్కొని యువకుల పరారీ

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కొని వెళ్లిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డు సీబీఐటీ స్కూల్ సమీపంలో నలిశెట్టి సులోచన నడిచి వెళ్తుండగా స్కూటీపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఆమె కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు వెంబడించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిశోర్ తెలిపారు.

బీజేపీ నాయకుడిపై పలువురి దాడి



దాడిలో గాయపడిన సురేష్

రేపల్లె రూరల్: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన నగరం మండలం బోరమాదిగపల్లిలో చోటుచేసుకుంది. బోరమాదిగపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నగరం మండల అధ్యక్షుడు జుజ్జువరపు సురేష్‌కు అదే గ్రామానికి చందిన చందోలు వీరయ్యతో కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. వీరయ్య మరి కొంతమంది గురువారం రాత్రి గ్రామ సమీపంలో కాపుకాసి ఇంటికి వెళ్తున్న సురేష్‌పై దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో వీరయ్యతోపాటు దాడికి ఉపక్రమించిన వారు పారిపోయారు. సురేష్‌ను వైద్య చికిత్సల కోసం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరయ్యతోపాటు దాడికి పాల్పడిన వారు మంకీ క్యాప్ ధరించి ఉన్నారని బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం ఎస్ఐ భార్గవ్ తెలిపారు. సురేష్‌పై దాడి సంఘటన తెలుసుకున్న బీజేపీ నాయకులు బేతపూడి వెంకటేశ్వరరావు, పిన్ని సాంబశివరావులు పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా శింగరకొండ తిరునాళ్ల

- పోటెత్తిన భక్తులు
- సత్రాల్లో అన్నదానం
- వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు
- మజ్జిగ, తాగునీరు, ప్రసాదాల పంపిణీ
- 70 సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో పర్యవేక్షణ



సర్వాలంకృతుడైన ప్రసన్నాంజనేయస్వామి



ప్రత్యేకాలంకరణలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి

అద్దంకి/అద్దంకి రూరల్: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, కొండపైనున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామివార్ల 70వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీశైలం దేవస్థాన డిప్యూటీ కమిషనర్ రమణమ్మ ప్రత్యేకాధికారిగా, ఏసీ తిమ్మనాయుడు ప్రత్యేక సిబ్బంది సహకారంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉచిత దర్శనం కల్పించారు. వీఐపీ, వికలాంగులకు, వృద్ధులకు, ప్రత్యేక దర్శన క్యూలైన్లతోపాటు, వివిధ ధరలతో దర్శన క్యూలను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలోని భక్తులకు మజ్జిగ, తాగునీరుతోపాటు, దర్శనం చేసుకున్న వారికి ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. వివిధ బ్యాంక్ బ్రాంచ్‌లు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీటిని ఉచితంగా పంపిణీ చేశాయి.

ప్రత్యేక పూజలు..

ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు స్వామివారికి చక్కెర పొంగలి వండి, కుండలను నెత్తిన పెట్టుకుని దర్శనంతో మొక్కులు తీర్చుకున్నారు. కొండ మీద శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఈవో కోటిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణం, సామూహిక వ్రతాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించారు.

వివిధ శాఖల ఆధ్వర్యంలో పర్యవేక్షణ

ఆలయ పరిసరాల్లో, విద్యుత్ శాఖ, మోదేపల్లి పీహెచ్‌సీ, పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, ఫైర్, మునిసిపల్‌తో పాటు, మండల పరిషత్, ఎల్ఐసీ, స్టేట్‌బ్యాంక్ వివిధ బ్యాంక్ బ్రాంచ్‌లు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వాసవీ వనిత క్లబ్ ప్రకాశం ప్రభుత్వ హైస్కూల్1980–81 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటుతో మజ్జిగ, తాగునీరు, పులిహోర పంపిణీ చేశారు.అన్ని సామాజిక సత్రాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం నిర్వహించారు.

అద్దంకి డిపో నుంచి ప్రత్యేక బస్సులు

అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. వీటితోపాటు జిల్లాలోని వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట, ఒంగోలు, దర్శి, పొదిలి తోపాటు వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపారు. కొండమీద లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి వెంకటాపురానికి చెందిన పాకనాటి అంజిరెడ్డి, పాకనాటి మధుసూదన్‌రెడ్డికి చెందిన రెండు బస్సుల్లో భక్తులను ఉచితంగా చేరవేశారు.

ఆకర్షణీయంగా అంగళ్లు

తిరునాళ్ల సందర్భంగా క్షేత్రానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బొమ్మల దుకాణాలు, చెరుకు విక్రయ దుకాణాలు, వివిధ వస్తువులతో నిర్వహించిన సంతల్లో భక్తులు వస్తువులను కొనుగోలు చేశారు. తిరునాళ్లలో ఏర్పాటు చేసిన జైంట్ వీల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెట్టారు.

వైభవంగా శత చండీ మహా యాగం



త్రిశక్తి దుర్గా పీఠంలో యాగ నిర్వహణ

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్టా బ్రహ్మ, దేవీ ఉపాసకులు, విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య శ్రీ హనుమత్ స్వామి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చండీ పారాయణం, శత చండీ హోమం, గురు వందనం, ప్రధాన దేవతా అర్చణ, శత చండీ హోమం, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్ర పుష్పం, అమ్మవార్లకు దశ విధ అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. బగలా ముఖి, రాజశ్యామల, వారాహి హోమాలు, యోగిని మండప హోమాలు నిర్వహించారు.గణేష్ యువసేన, త్రిశక్తి దుర్గాపీఠం బ్రహ్మోత్సవ కమిటీ, త్రిశక్తి దుర్గాపీఠం మహిళా శక్తి బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 6న ప్రారంభమైన పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం శనివారంతో ముగియనుంది. ఆఖరి రోజు శనివారం సర్వతోభద్ర మండల హోమాలు, ప్రాయశ్చిత హోమాలు, శాంతి హోమాలు, మహా పూర్ణాహుతి, శివపార్వతుల కల్యాణం, ప్రోక్షణ, వేదఆశీర్వచనం, పండితుల సత్కారాలు, అన్నదానం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు హజరుకానున్నట్లు ధర్మకర్తలు తెలిపారు.

రైతులను భాగస్వాములను చేయాలి

రైతు సాధికారిత సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్



శిక్షణలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికలో రైతులను భాగస్వాములను చేయాలని రైతు సాధికారిత సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి వార్షిక కార్యచరణ ప్రణాళికపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి జూమ్ కాల్ ద్వారా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ రసాయన వ్యవసాయం వల్ల పర్యావరణానికి తీవ్రంగా నష్టం కలుగుతుందని తెలిపారు. వాతావరణం కూడా అత్యవసరస్థితిని ఎదుర్కొంటుందని చెప్పారు. ఖరీఫ్ వార్షిక ప్రణాళిక, సార్వత్రిక సూత్రాలు, పలు జిల్లాల్లో వ్యవసాయ విధానాలు, రైతులు పండిస్తున్న ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్‌లో పండిస్తున్న పంటలు, రైతుల విజయ గాథలను వివరించారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ వ్యవసాయ, డీఆర్‌డీఏ, ఉపాధి హామీ, సెరీకల్చర్, హార్టీకల్చర్ తదితర శాఖల సమన్వయంతో కలిసి ప్రణాళికలను తయారు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. నవధాన్యాలు సాగుభూమికి ఎంత మేలు చేస్తాయో వివరించారు. రైతులంతా పీఎండీఎస్ పద్ధతిని అవలంబించి సాగు చేయాలని సూచించారు. 30 రకాల విత్తన పద్ధతిని పాటిస్తే భూములు సారవంతమవుతాయని తెలిపారు. భూమి సంవత్సరమంతా పచ్చగా ఉంటే జీవ వైవిధ్యం పెరిగి భూమి సారవంతమై, చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, రాష్ట్ర శిక్షకురాలు శాంతి, జిల్లా శిక్షకుడు సైదయ్య, ఎన్‌ఎఫ్ఏలు నందకుమార్, అప్పలరాజు, సౌజన్య, మేరి, స్వాతి పాల్గొన్నారు.

నేడు స్త్రీ, పురుషుల రాష్ట్ర ఖోఖో జట్టు ఎంపిక

జె.పంగులూరు: మండలంలోని స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యాన జాతీయ స్త్రీ, పురుషుల జట్టు ఎంపిక జరగనున్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికకు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 100 మంది పురుషులు, 100 స్త్రీలు వరకు పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో కోచ్‌లు, మేనేజర్లు, వివిధ జిల్లాల కార్యదర్శులు పాల్గొని ప్రతిభా వంతులైన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరిలో జరిగే 57 వ సీనియర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య పాల్గొంటారని తెలిపారు. ఎంపిక ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో పంగులూరు గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 28 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలో సాప్ అబ్జర్వర్, జిల్లా కార్యదర్శి బి. కాశీవిశ్వనాథరెడ్డి, అధ్యక్షులు కుర్రా భాస్కరరావు, ట్రెజరర్ కె. హనుమంతరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా టెక్నికల్ ఆఫీసర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొంటారని సీతారామిరెడ్డి తెలిపారు.

నంది అవార్డులకు 2014లో గ్రహణం



మాట్లాడుతున్న దిలీప్ రాజా

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : ఏపీలోని నందు (నంది అవార్డులు)లు అస్వస్థతకు గురైనట్లు మా–ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా వ్యాఖ్యానించారు. గుంటూరు బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గద్దర్ పేరుతో అవార్డులు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. ఏపీలో మాత్రం 2013 నుంచి నిలిపివేసిన నంది అవార్డుల ప్రదానంపై విధి విధానాలను ప్రభుత్వం రూపొందించాలని కోరారు. నంది అవార్డులకు 2014 నుంచి గ్రహణం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. అవార్డుల ఎంపిక విధానంలో ప్రతిభను మాత్రమే గుర్తించాలని డిమాండ్ చేశారు. సినీ పరిశ్రమను, సినిమా కళాకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దర్శకులు నరేష్ దోనె, మణివరన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం మూటలు స్వాధీనం



తాడికొండ: తాడికొండ మండలం నిడుముక్కలలో అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 16 రేషన్ బియ్యం మూటలను గురువారం అర్ధరాత్రి పౌర సరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిడుముక్కల దర్గాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఈ మూటలను పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూటలను రేషన్ షాప్ నంబర్ 12కు అప్పగించినట్లు రెవెన్యూ ఆర్ఐ హనుమంతరావు వెల్లడించారు.

మాణిక్యవేల్‌కు నివాళి



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత డాక్టర్ అరుణాచలం మాణిక్యవేల్ (77) అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం విదితమే. అరండల్‌పేట 10/2వ అడ్డ రోడ్డులోని ఆయన నివాస గృహంలో సందర్శకుల సందర్శనార్థం ఉంచారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి (పశ్చిమ), నసీర్ అహ్మద్ (తూర్పు), ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో పాటు ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాణిక్యవేల్ అంత్యక్రియలుకొరిటెపాడులోని శ్మశాన వాటికలో జరిగాయి. కుటుంబ సభ్యులు, ట్రిపుల్ ఎక్స్ సోప్ ఉద్యోగు, సిబ్బంది పెద్దఎత్తున తరలివెళ్లారు.

నూతన పారిశ్రామిక చట్టంపై అవగాహన పెంచుకోవాలి

ఎంఎస్ఎంఈ ఏడీ డాక్టర్ కె.ఎల్.ఎస్.రెడ్డి



మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఎల్.ఎస్.రెడ్డి

బాపట్ల: నూతన పారిశ్రామిక విధానాలపై అవగాహన కలిగి ఉండి ప్రభుత్వం ఇచ్చే రాయితీలను, సహకారాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే పారిశ్రామిక రంగంలో అభివృద్ధిని సాధించవచ్చని ఎంఎస్ఎంఇ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కెఎల్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులు, వాటిపై అవలంబించాల్సిన విధానాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలను స్థాపించేందుకు కావాల్సిన వనరులపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీల గురించి తెలుసుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఇండస్ట్రియల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు తక్కువ పెట్టుబడి వ్యయంతో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని నాణ్యతతో కూడిన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ పథకాలలో సబ్సిడీలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ పి.వీరయ్య, బాపట్ల జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిశెట్టి రత్నగుప్తా, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి

ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. కాశీం



ప్రసంగిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాశీం

ఏఎన్‌యూ: అట్టడుగు వర్గాల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.కాశీం అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ బాబూ జగ్జీవన్‌రామ్ ఇన్ నేషన్ బిల్డింగ్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభలో ఆచార్య కాశీం కీలకోపన్యాసం చేశారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ లక్ష్యం ఒక్కటేనన్నారు. ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ కమిషనర్ బి.కోటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళా వందనం, విశ్రాంత ఐఆర్‌టీఎస్ అధికారి ఎ.భరత్‌భూషణ్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆలోచనా విధానాలను వివరించారు. వీసీ ఆచార్య కె. గంగాధరరావు అధ్యక్షోపన్యాసం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, కావలి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ కళాశాల కామర్స్ విభాగాధిపతి ఆచార్య సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ నివేదిక సమర్పించారు. అనంతరం సదస్సు పరిశోధనా పత్రాల సావనీర్‌ను, బాబూ జగ్జీవన్‌రామ్ ఫౌండేషన్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్. ఆనందబాబు రాసిన కర్మయోగి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

పాతకక్షలతో ఓ వ్యక్తిపై దాడి

రేపల్లె రూరల్: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని జంగాలపాలెంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న కొమరాబత్తిని శ్యామ్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన కనపర్తి నాగేంద్రబాబు గురువారం రాత్రి కత్తితో దాడికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు నాగేంద్రబాబును అడ్డుకుని తీవ్రంగా గాయపడిన శ్యామ్‌కుమార్‌ను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ మల్లికార్జున రావు తెలిపారు.

విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖపట్నం-చర్లపల్లి ప్రత్యేక రైలు (08579) ఈ నెల 16న సాయంత్రం 6.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (08580) ఈ నెల 17న ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, అదే రోజు రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. రెండు మార్గాలలో ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడకుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌లలో ఆగుతుంది.

నాటు సారాతో కుటుంబాలు రోడ్డు పాలు

- నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరం
- బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు

నిజాంపట్నం: నాటు సారా తాగటంతో జీవితాలు నాశనమవ్వటమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడిన సంఘటనలు అనేకం ఉన్నాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటు సారాతో కలిగే దుష్పరిణామాలపై నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఆధ్వర్యాన మండలంలోని దిండి పంచాయతీ యేమినేనివారిపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నాటు సారా వ్యతిరేక నినాదాలతో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. తామే కాకుండా తమ కుటుంబ సభ్యుల జీవితాలను సైతం పాడుచేయటం ఎంత వరకు సబబో తామే ఆలోచించాలని సూచించారు. అపరిశుభ్ర వాతావరణంలో అశాస్త్రీయంగా తయారు చేయటంతో నాటు సారాలో ఎక్కువ మోతాదులో విషపూరిత రసాయనాలు ఉంటాయని, దీన్ని తీసుకోవటంతో ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుందని, శరీరంలో అన్ని అవయవాలు దెబ్బతింటాయన్నారు. ఆర్థికంగా, సామాజికంగా గౌరవ మర్యాదలు కోల్పోయిన వారవతారన్నారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా చట్టరీత్యా నేరమని, ఈ నేరానికి పాల్పడిన వారికి 8 సంవత్సరాల కఠిన శిక్షతోపాటు రూ.5లక్షలు జరిమానా విధిస్తారని తెలిపారు. నాటుసారా తయారు చేసేవారికి అవసరమైన ముడిసరుకులు అందించే వారికి, విక్రయించే వారికి కూడా శిక్షలు తప్పవని చెప్పారు. గ్రామంలో నాటుసారా తయారు కాకుండా ఉండేందుకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎవరైనా నాటుసారా తయారు చేస్తున్నట్లు గమనిస్తే తమకుగాని, 9490455599, 9440902477 నంబర్లకుగాని, 14405 టోల్‌ఫ్రీ నంబరుకుగాని సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరం సీఐ శ్రీరామ్‌ప్రసాద్, ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు ఎస్.రామారావు, పి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.